సాక్షి
ఖమ్మం
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



ముస్తాబవుతున్న గణనాథులు
వినాయక చవితి సమీపిస్తుండడంతో గణనాథుడి విగ్రహాలను ముస్తాబు చేయగా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. 8లో



శాస్త్రీయ విద్యావిధానం కావాలి
ప్రస్తుతం శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయడంపై దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాకు మంత్రి హరీశ్‌రావు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో ఖమ్మం వస్తారు. గురువారం ఉదయం 10 గంటలకు మంత్రులు ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. ఆతర్వాత మమత మెడికల్ కాలేజీలోని సిల్వర్ జూబ్లీ బ్లాక్‌ను ప్రారంభించి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటుచేసిన సభలో మాట్లాడతారు. అలాగే, మధ్యాహ్నం 2.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవనానికి శంకుస్థాపన చేశాక హైదరాబాద్ బయలుదేరతారు.

15న ఎన్‌వైకే ఆధ్వర్యాన ఉపన్యాస పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే జిల్లా అధికారి చింత అన్వేష్ తెలిపారు. 'మహాత్మాగాంధీ జీవన విధానం – ఆలోచనలు' అంశంపై పోటీలు ఉంటాయని, ఆంగ్లం, హిందీ భాషల్లో మూడు నిమిషాల చొప్పున మాట్లాడొచ్చని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జాతీయస్థాయిలో పార్లమెంట్ హాల్‌లో జరిగే పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఆసక్తి ఉన్న జిల్లా కేంద్రంలోని ఎన్‌వైకే కార్యాలయంలో 15వ తేదీన ఉదయం 10 గంటలకు మొదలయ్యే పోటీలకు హాజరుకావాలని, వివరాలకు 90004 32563 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15న రెండు సెషన్లలో 'టెట్'

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లాలో ఉదయం 54 కేంద్రాల్లో, మధ్యాహ్నం 45 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అధికారులకు శిక్షణ పూర్తయినందున అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్న విషయంపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసమావేశంలో డీఈఓ సోమశేఖర శర్మ, జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం అదనపు సంచాలకులు ధన, రిసోర్స్ పర్సన్లు నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీలకు అనూష



ప్రథమస్థానంలో నిలిచిన అనూష

ఖమ్మంస్పోర్ట్స్: ఇటీవల ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.అనూష 100 కేజీల బరువు ఎత్తడంతో ప్రథమస్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక చేశారు. ఈ మేరకు అనూషను మంగళవారం కళాశాల చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్, సెక్రటరీ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రమణ, పీడీ జె.ఉపేందర్, కోచ్ వినోద్ అభినందించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



కందుకూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సీఈఓ అప్పారావు

వేంసూరు: సీజనల్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యాన గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ అప్పారావు సూచించారు. ప్రతీ గ్రామంలో మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని తెలిపారు. మండలంలోని కందుకూరు, పల్లెవాడ, చౌడవరం పంచాయతీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కందుకూరులో ఇటీవల డెంగీ కేసులు నమోదైన నేపథ్యాన గ్రామంలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఆయన బాధితులకు ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. అలాగే, చౌడవరం తండాలో పంచాయతీ భవనం, పల్లెవాడలో పల్లెప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్ పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ రమేష్,ఎంపీఓ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాహకం.. రసాభాస



నసీంఖాన్, నేతల ఎదుట నినాదాలు చేస్తున్న ఆశావహుల అనుచరులు

కాంగ్రెస్ విజయభేరి ముందస్తు సమావేశంలో ఆందోళన

- అనుచర నేతలు, కేడర్ నినాదాలతో దద్దరిల్లిన డీసీసీ కార్యాలయం
- పాత నేతలతో పాటు బీసీలకే టికెట్లు ఇవ్వాలని డిమాండ్
- పార్లమెంటరీ ఇన్‌చార్జ్ ముందు బలప్రదర్శన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: డీసీసీ కార్యాలయం వేదికగా ఏర్పాటుచేసిన విజయభేరి సన్నాహక సమావేశం రసాభాసగా సాగింది. తమ నేతకే టికెట్ ఇవ్వడంతో పాటు పాత నేతలకే పట్టం కట్టాలని, బీసీలను ఈసారైనా పట్టించుకోవాలనే నినాదాలు హోరెత్తాయి. ఒక దశలో వేదికపై ఉన్న నేతలపై కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న విజయభేరి సభ విజయవంతానికి ఖమ్మం పార్లమెంట్ స్థాయిలో డీసీసీ కార్యాలయం వేదికగా మంగళవారం సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. మహారాష్ట్ర మాజీ మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి ఆరిఫ్ నసీంఖాన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాది ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసమావేశం ప్రశాంతంగానే మొదలైనా, ఆ కాసేపటికే నినాదాలు, కార్యకర్తల ఆగ్రహావేశాలతో సాగింది.



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన పోట్ల నాగేశ్వరరావు, సంభాని, నసీంఖాన్, వీహెచ్, పొంగులేటి, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు

అనుచర నేతలకు జై..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వారి అనుచరులు ఈసమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ముఖ్యులను పరిచయం చేస్తుండగానే అనుచర నేతలు నినాదాలు మొదలుపెట్టారు. తమ నాయకుల పేర్లతో పోటాపోటీగా నినాదాలు చేస్తూ దూసుకొచ్చారు. వేదికపై ఉన్న భట్టి, రేణుకాచౌదరితోపాటు పువ్వాళ్ల వారిని వారించినా నినాదాలు సద్దుమణగలేదు. ఇక పార్టీ జెండా మోసిన నేతలకే టికెట్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇవ్వొద్దని, జనాభా ప్రాతిపదికన ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాల్లోనూ బీసీలకు కూడా టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం నుంచి వచ్చిన నేతలు సైతం ఇదే డిమాండ్ వ్యక్తం చేశారు. సమావేశం ముగిశాక కూడా టికెట్లు ఆశిస్తున్న నేతలు, వారి అనుచరులు పార్లమెంట్ ఇన్‌చార్జి నసీంఖాన్‌ను కలిసి కష్టపడి పనిచేస్తున్న వారికి టికెట్లు ఇవ్వకపోతే నష్టం జరుగుతుందని పరోక్షంగా హెచ్చరించారు.

వీహెచ్‌పై గరం గరం

సమావేశాన్ని ఉద్దేశించి మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతుండగా టికెట్ ఆశిస్తున్న వారి అనుచరులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇతర జిల్లాల నేతలకు ఇక్కడేం పని, జిల్లాలో ఎవరు సీనియర్, ఎవరు జూనియరో నీకేం తెలుసు' అంటూ మండిపడ్డారు. దీంతో వీహెచ్ కూడా వారిపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. వేదికపైన ఉన్న నేతలు సముదాయిస్తున్నా నినాదాలు ఆగలేదు. దీంతో వీహెచ్ ప్రసంగాన్ని ముగించారు. అంతకు ముందు భట్టి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ఉండాలని, విజయభేరి సభను విజయవంతం చేసేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆయన తనకు పార్టీ పెద్దలతో జూమ్ మీటింగ్ ఉందంటూ డీసీసీ కార్యాలయంలోని చాంబర్‌లోకి వెళ్లిపోగా, ఆతర్వాత పొంగులేటి కూడా వెళ్లిపోయారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, పోట్ల నాగేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ, విజయాబాయి, ఎం.డీ.ముస్తఫా, ఎం.డీ.జావిద్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ నాయక్, దొబ్బల సౌజన్య, రామ్మూర్తినాయక్, కోటూరి మానవతారాయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశం ఆద్యంతం నినాదాలు ఆపకపోవడంతో ముఖ్య నేతలు ప్రసంగాలు కొనసాగించగా, సన్నాహక సమావేశం కాస్తా టికెట్లు ఆశిస్తున్న వారి బలప్రదర్శనకు వేదికగా మారినట్లయింది.

తెలంగాణ ఇచ్చిన దేవత.. సోనియా

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ పరిశీలకులు మహ్మద్ ఆరిఫ్ నసీంఖాన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పది అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా అంటే సోనియా, రాహుల్‌కు ఎంతో అభిమానమని, పార్టీ జెండా పట్టుకుని.. బలోపేతం చేస్తున్న వారందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కాగా, తెలంగాణ వచ్చిన పదేళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇస్తుండంతోనే తరచుగా మహారాష్ట్రకు వస్తున్నారని పేర్కొన్నారు.

- ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. నలభై ఏళ్లుగా పార్టీ జెండాలను మోసిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని.. తప్పుడు నివేదికలతో కొందరికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని విమర్శించారు. ఏదిఏమైనా కాంగ్రెస్ గాలి వీస్తుండడంతో వచ్చేది తమ ప్రభుత్వమేనని తెలిపారు.
- కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని, ఇక్కడ గొడవలు పెట్టుకోవద్దని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పెద్ద వారిని గౌరవించుకోవాలని తెలిపారు. అందరం కలిసికట్టుగా ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్

పురోగతిపై కలెక్టర్ గౌతమ్ సమీక్ష

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిమిత్తం భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం భూసేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన 234.24 ఎకరాల భూమిలో 113.25 ఎకరాల సేకరణ పూర్తయిందని తెలిపారు. ఇప్పటికే సేకరించిన భూమిలో పంటలు వేయకుండా అవగాహన కల్పించి స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. అలాగే, సిరిపురం–లక్ష్మీపురం హైలెవల్ వంతెన, ముజ్జుగూడెం రోడ్డు నిర్మాణానికి భూసేకరణ కోసం నిధులు జమ చేయాలన్నారు. సింగరేణి మండలం అప్పాయిగూడెం వద్ద నాబార్డ్ గోడౌన్లకు రహదారి నిర్మించాలని, మూడో రైల్వేలైన్ కోసం భూసేకరణపై దృష్టి సారించాలని సూచించారు. ఇంకా సింగరేణి మండలం గాంధీపురంలో రైల్వే స్టేషన్ విస్తరణ, సీతారామ ఎత్తిపోతల పథకంపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ మయాంక్ సింగ్, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కీలకం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులకు ఓటు హక్కుపై ఆయన అవగాహన కల్పించారు. ఈనెల 19వరకు అవకాశమున్నందున అందరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈసమావేశంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మెడికల్ కాలేజీలో పరిశీలన

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. మెడికల్ కాలేజీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన లెక్చర్ హాళ్లతో పాటు అన్ని విభాగాల్లో పరిశీలించారు. ఈనెల 14న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వస్తున్న నేపథ్యాన పనులన్నీ పూర్తిచేయాలని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, టీఎస్‌ఎంఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దీక్ష చేపట్టిన విద్యుత్ కార్మికులు



దీక్షలో కూర్చున్న విద్యుత్ కార్మికులు

ఖమ్మంవ్యవసాయం: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వివిధ విభాగాలకు చెందిన విద్యుత్ కార్మికులు(సీఐటీయూ అనుబంధం) రిలే నిరాహార దీక్షకు దిగారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ దీక్షలు మొదలయ్యాయి. ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, ట్రాన్స్‌కో సీబీడీ, ఎస్ఎంజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మీటర్ రీడింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్ఎంలకు వేతన బకాయిలను చెల్లించాలనే తదితర డిమాండ్‌తో ఈ దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, ఈనెల 15న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు నాయకులు వెల్లడించారు. దీక్షలను ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ ప్రారంభించగా, పుష్పరాణి, నాగేశ్వరరావు, సీతయ్య, శ్రీను, కృష్ణమూర్తి, వీరయ్య, రాజా, రాజేష్, పుల్లయ్య, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారసులు కమ్యూనిస్టులే..

ఖమ్మంమయూరిసెంటర్: వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం సుందరయ్య భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వారిని పార్టీ శ్రేణులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈనెల 16న భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సభకు తరలిరావాలని కోరారు. నాయకులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, నండ్ర ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, రమణారెడ్డి, కే.వీ.రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న తిరుమలాయపాలెం మండల అంగన్‌వాడీలు

జీపీ కార్యదర్శుల ద్వారా రేషన్ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలనే తదితర డిమాండ్లతో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన సమ్మె చేస్తున్నారు. ఈమేరకు జిల్లాలోని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేయగా, తిరుమలాయపాలెం ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు ఖమ్మం పెద్దతండా వద్ద చెవుల్లో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 689 మంది టీచర్లు, 579 మంది హెల్పర్లు రెండో రోజు సమ్మెలో పాల్గొన్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ గుర్తించింది. దీంతో పలు కేంద్రాల నిర్వహణను ఆయాలు చూసుకుంటున్నారు. అలాగే, లబ్ధిదారులకు ఇబ్బంది ఎదురుకాకుండా పౌష్టికాహారం పంపిణీ బాధ్యతలను జీపీల కార్యదర్శులు, వీఆర్‌ఓలకు అప్పగించారు.

దహనసంస్కారాలకు ఆర్థికసాయం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ మృతి చెందే కార్యకర్తల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు మరణిస్తే రూ.20 వేలు, మినీ కేంద్రాల టీచర్లు, ప్రధాన కేంద్రాల్లోని హెల్పర్లు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అధికారులకు అందాయి. అయితే, తాము సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుండగా, అంత్యక్రియలకు చార్జీలు మంజూరు చేయడం సరికాదని కార్యకర్తలు పేర్కొన్నారు. కాగా, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మంత్రి పువ్వాడ అజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల తరఫున సీఎం కేసీఆర్‌కు ఓప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

'నిర్మాణ్' ద్వారా ఉన్నత చదువులపై అవగాహన

ఖమ్మం మయూరిసెంటర్: ప్రభుత్వ గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థుల్లో విద్యాప్రమాణాలను పెంపొందించడంతో పాటు కెరీర్‌పై అవగాహన కల్పించేందుకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. ఈమేరకు సంస్థ రూపొందించిన ప్రత్యేక వాహనాన్ని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ఈ వాహనం ద్వారా గ్రామాలు, విద్యాసంస్థలకు వెళ్లి ఉన్నత చదువులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఓ నారాయణరెడ్డి, ఏటీడీఓ తిరుమలరావు, కౌన్సిలర్లు కె.కళింగ, సాయిబాబా, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

విద్యార్థులే రచయితలు!

- సొంత గ్రామాల చరిత్రపై పుస్తకాలు
- తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన రూపకల్పన
- ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీలో స్వీకరించిన చైర్మన్ గౌరీశంకర్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సాహిత్య అకాడమీ చేపట్టిన 'మన వూరు – మన చరిత్ర' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలోని రెండు వేల గ్రామాల చరిత్ర నమోదైందని అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 568మంది తమ గ్రామాల చరిత్రను పుస్తకాల రూపంలో సిద్ధం చేయగా... ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా మంగళవారం చైర్మన్ గౌరీశంకర్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ఏడాది క్రితం డిగ్రీ విద్యార్థులతో వారి స్వగ్రామాల చరిత్ర రాయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సహకారంతో ఇప్పటివరకు రెండు వేల గ్రామాల చరిత్ర సిద్ధమైందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తమ గ్రామాల ప్రత్యేకతలపై అవగాహన పెరగడమే కాక వారిలోని సృజనాత్మక శక్తి వెలికితీసినట్లవుతుందని తెలిపారు. ప్రతీ గ్రామ చరిత్ర, ప్రత్యేకతలే కాక తెలంగాణ రాక ముందు, వచ్చాక జరిగిన అభివృద్ధిని పుస్తకాల రూపంలో సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఊరి చరిత్రను రాసిన వారిని గ్రామస్తులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. విద్యార్థులు రాసిన చరిత్రే భవిష్యత్ తరాలకు గెజిట్‌గా మారుతుందని చెప్పారు. సాహిత్య అకాడమీ చేపట్టిన ఈ కార్యక్రమానికి అండగా నిలవడమే కాకుండా విద్యార్థులు రాసిన పుస్తకాలను వెలుగులోకి తేవడానికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీ.వీ.రెడ్డి, టి.జీవన్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ సీతారాం, మిల్టన్, జె.రమేష్, డాక్టర్ సర్వేశ్వరరావు, డాక్టర్ వరలక్ష్మి, అత్తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను గౌరీశంకర్‌కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, కాలేజీ ప్రిన్సిపాల్ జాకీరుల్లా

నేడు మెడికల్ సర్టిఫికెట్ల పునఃపరిశీలన



ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోంది. ఈక్రమంలో ఉపాధ్యాయులు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లను బుధవారం పునఃపరిశీలించనున్నారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించిన అధికార యంత్రాంగం... గతంలో తీసుకుని సమర్పించిన సర్టిఫికెట్లను మరోమారు పరిశీలించాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా గ్రేడ్–2 హెచ్ఎంల పోస్టుల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో జరుగుతుండగా, సర్వర్ సమస్య తలెత్తిందని సమాచారం.అయితే, ఈ సమస్య అర్ధరాత్రి వరకు పరిష్కారమయ్యే అవకాశముందని తెలిసింది.

గురుకుల పాఠశాలలో ఆర్‌సీఓ తనిఖీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురుకులాల సంస్థ ఖమ్మం ప్రాంతీయ అధికారి(ఆర్‌సీఓ) కె.ప్రత్యూష మంగళవారం తనిఖీ చేశారు. గత వారం పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందిపై తల్లిదండ్రులు పలు ఆరోపణలు చేశారు. ఈనేపథ్యాన తనిఖీకి వచ్చిన ఆర్‌సీఓ రికార్డులను పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడారు. అలాగే, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కాగా, తాము చేసిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

క్లుప్తంగా

డాక్టర్ శ్రీనివాస్‌కు ఐక్యరాజ్యసమితి ఆహ్వానం



డాక్టర్ ఏలూరి శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన డాక్టర్ ఏలూరి శ్రీనివాస్‌కు ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగే సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈనెల 16, 17వ తేదీల్లో న్యూయార్క్‌లో 'ఐక్యరాజ్య సమితి – సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల' అంశంపై జరిగే సదస్సులో ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ డిప్లొమాటిక్ రిలేషన్స్ అండ్ కల్చర్ సంస్థ తరఫున తాను హాజరవుతున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం, అణు ఆయుధ నిర్మూలన అంశాలపై మాట్లాడతానని వెల్లడించారు. కాగా, అంతర్జాతీయ సదస్సులో పాల్గొననున్న శ్రీనివాస్‌ను పద్మశ్రీ దరిపల్లి రామయ్య, డాక్టర్ సునీత, తెలంగాణ కళాపరిషత్ అధ్యక్షుడు పగిడిపల్లి రాజారావు తదితరులు అభినందించారు.

ఏఏఆర్‌ఎం మహాసభల ప్రతినిధిగా బాలాజీ



బానోతు బాలాజీ

ఏన్కూరు: తమిళనాడులో జరగనున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఏఏఆర్‌ఎం) మహాసభలకు రాష్ట్రప్రతినిధిగా ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌కు చెందిన తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు బాలాజీ ఎంపికయ్యారు. ఈ సభలు ఈ నెల 19నుంచి 21వరకు తమిళనాడు రాష్ట్రం నమ్మక్కల్ జిల్లాలో జరగనున్నాయి. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు, పరిష్కార మార్గాలపై ఈ సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు.

కృష్ణాపురం వాసికి డాక్టరేట్



సైదులు

మధిర: మండలంలోని కృష్ణాపురానికి చెందిన బి.సైదులుకు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాఘవేంద్రశర్మ పర్యవేక్షణలో ఆయన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సైదులుకు ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించగా ఆయన తల్లిదండ్రులు బి.జయరాం – సరోజినితో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మాదిగలకు అవకాశం కల్పించాలి..

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు మాదిగలకు అవకాశం కల్పించాలని మాజీ టీపీసీసీ కార్యదర్శి వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ కోరారు. ఈసందర్భంగా మంగళవారం ఖమ్మంవచ్చిన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు మహ్మద్ ఆరిఫ్ నసీంఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్‌లో తాను అంకితభావంతో పనిచేస్తున్నానని, విద్యార్థి దశలో టీపీసీసీ సెక్రటరీగా పని చేసినట్లు తెలిపారు. గత 55 ఏళ్లుగా తమ కుటుంబం పార్టీనే నమ్ముకున్న నేపథ్యాన సత్తుపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు.

రహదారి ధ్వంసంతో రైతుల ఇక్కట్లు



కందకాన్ని పూడ్చివేస్తున్న రైతులు

కారేపల్లి: గత నలభై ఏళ్లుగా పొలాలకు వెళ్లే రహదారిని ధ్వంసం చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కారేపల్లి మెయిన్ రోడ్డు నుండి వెలుగు కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాలతోపాటు సుమారు 60మంది రైతులు పొలాలకు వెళ్లే రహదారిని కొందరు ఇటీవల తమ భూమి అని చెబుతూ ధ్వంసం చేశారు. అంతేకాకుండా జీపీ నిధులతో నిర్మించిన కల్వర్టును సైతం కూలగొట్టారు. అయితే, మంగళవారం కందకాన్ని పూడ్చేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో రైతులు, స్థానికులు ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఈమేరకు అధికారులు స్పందించాలని స్థానికులు పిల్లి వెంకటేశ్వర్లు, పేర్ని వెంకటేశ్వర్లు, పోతు వెంకటనర్సయ్య, అక్కుల బొందెలు డిమాండ్ చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
మొక్కజొన్న	1,900	1,900
పెసలు	8,500	5,600
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,250	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి	7,325	4,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,026

ముస్తాబవుతున్న గణనాథులు



రానున్న వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకునేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. గణనాథుడి విగ్రహాలు ఇప్పటికే సిద్ధం కాగా.. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, మండపాల ఏర్పాటు పనులు కూడా మొదలుపెట్టారు. అయితే, ముడిసరుకుల ధరలు పెరిగిన నేపథ్యాన ఈసారి విగ్రహాల ధరలు కూడా పెరిగినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ భక్తులు ఎక్కడా తగ్గకుండా మండపాల ఏర్పాటు, గణేష్ నవరాత్రోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా రాజస్తాన్ నుంచి వచ్చిన వారు విగ్రహాలను తయారుచేశారు. గత మూడు నెలలుగా తయారీలో నిమగ్నం కాగా.. విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతూ అమ్మకంపై దృష్టి సారించారు. – మధిర

ఇప్పటికే విగ్రహాలు రెడీ.. అమ్మకాలు మొదలు

- ఈ ఏడాది మండపాలు పెరిగే అవకాశం
- మూడు నెలలుగా తయారీలో నిమగ్నమైన రాజస్థాన్ వాసులు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న గణనాథులు

ఆకట్టుకునేలా విగ్రహాలు

రాజస్తాన్‌లోని పాలీ జిల్లా బికనీర్ తదితర ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా వచ్చిన పలువురు గణనాథుల విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. గత మూడు నెలలుగా అచ్చుల సాయంతో విగ్రహాలను రూపొందించగా, ఇప్పుడు తుది మెరుగులు దిద్దుతున్నారు. బొమ్మల తయారీలో నైపుణ్యం కలిగిన రాజస్తాన్‌కు చెందిన వందలాది కుటుంబాలు సుమారు రెండు దశాబ్దాల కాలంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా దేవతా మూర్తుల బొమ్మలను అందంగా తయారు చేస్తారు. రహదారుల వెంట ఖాళీ స్థలాలను లీజ్‌కు తీసుకొని వాటిలో గుడారాలను ఏర్పాటు చేసుకొని విగ్రహాలను తయారు చేస్తుండగా.. సుమారు సుమారు 500 కుటుంబాలకు పైగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్లు అంచనా. ఖమ్మం, వైరా, మధిర, ఎర్రుపాలెం, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, ఏన్కూరు, భద్రాచలం, తల్లాడ తదితర ప్రాంతాల్లో బొమ్మల తయారీ పనుల్లో వీరు ప్రస్తుతం నిమగ్నమయ్యారు.

సరిహద్దు ప్రాంతాల నుంచి....

ఖమ్మం జిల్లాకు సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి భక్తులు సైతం జిల్లాకే వచ్చి గణపతి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. మధిరలోని కళామందిర్, వైరా రోడ్డులోని భారత్ పెట్రోలియం బంక్ పక్కన, బంక్ ఎదురుగా, రెడ్డి గార్డెన్స్ రోడ్డు సమీపంలో విగ్రహాలను తయారుచేస్తున్నారు. తక్కువ లాభంతోనే తయారీదారులు విగ్రహాలను అమ్ముతుండగా కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో కుటుంబం 500 నుంచి 800 వరకు విగ్రహాలను తయారుచేయడం విశేషం.

ఆర్డర్లు బాగానే ఉన్నాయి...



పాతికేళ్లుగా మధిర ప్రాంతంలో వినాయక విగ్రహాలు తయారుచేసి విక్రయిస్తున్నాం. కాలుష్యం తక్కువగా ఉండేలా విగ్రహాలు తయారుచేస్తాం. ఈ ఏడాది విగ్రహాలకు ఆర్డర్లు బాగానే ఉన్నాయి. అన్ని వర్గాల ప్రజలు పండుగ సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

– టిక్కా, విగ్రహాల తయారీదారుడు, మధిర

తక్కువ లాభంతోనే విక్రయం



బొమ్మల తయారీదారుల నుంచి భారీగా విగ్రహాలను కొనుగోలు చేశాం. అనంతరం హోల్‌సేల్, రిటైల్‌గా తక్కువ లాభంతోనే విక్రయిస్తాం. వివిధ రకాల ఆకృతుల్లోని వినాయక ప్రతిమలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయి. ఆర్డర్ల ఆధారంగా విగ్రహాలను కావాల్సిన చోటకు తరలిస్తున్నాం.

– చావా అవినాష్, వ్యాపారి, మధిర

అనేక రూపాల్లో..

రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి వచ్చిన కుటుంబాలు అక్కడి నుంచే ప్రతిమల తయారీకి కావాల్సిన అచ్చులు తెచ్చుకుంటారు. ఆతర్వాత కొబ్బరిపీసు, తెల్ల సిమెంట్ ఇతరత్రా సరుకులను హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో కొనుగోలు చేస్తారు. ఇక వినాయక చవితికి ముందు నుంచి విగ్రహాల తయారీ మొదలుపెడతారు. ఓం, మహారాజ, పుష్పం, హంస, ఏనుగు, ఆవు, ఎలుక, సింహం, నెమలి, రాధాకృష్ణులు, నందీశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులు, ఆంజనేయస్వామి, బాల గణేష్, వేంకటేశ్వర స్వామి ఇలా రకరకాల రూపాల్లో బొజ్జ గణపయ్య రూపొందించి అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఒక అడుగు మొదలు పది అడుగుల వరకు విగ్రహాలను తయారు చేశారు. అయితే, సిమెంట్, కొబ్బరి పీచు, రంగుల ధరలు పెరగడంతో ఈసారి విగ్రహాల ధరలు కాస్త పెరిగినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ స్థానికంగా అందుబాటు ధరల్లోనే విగ్రహాలు లభిస్తున్నాయని ఉత్సవాలు నిర్వాహకులు చెబుతున్నారు. సుదూర ప్రాంతాల్లో కొనుగోలు చేస్తే రవాణా ఖర్చులతో పాటు సమయం వృధా అవుతుందని భావించిన వారు ఇక్కడే కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపిక



భవాని

రఘునాథపాలెం: సబ్ జూనియర్ విభాగంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు మండలంలోని వీ.వీ.పాలెం పాఠశాల విద్యార్థిని వడ్డెబోయిన భవాని ఎంపికైంది. ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు కర్ణాటకలో జరిగే పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ఆమె పాల్గొంటుందని హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. ఈసందర్భంగా భవానీని మంగళవారం హెచ్‌ఎంతో పాటు పీఈటీ ఏ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తొలగించొద్దు



విగ్రహం వద్ద మాట్లాడుతున్న శ్రీలక్ష్మి, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాత కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నాలను మానుకోవాలని కుల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విగ్రహాన్ని పరిశీలించాక తెలంగాణ బీసీ ఫ్రంట్ అధ్యక్షురాలు కొత్తకొండ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఐలమ్మ విగ్రహాన్ని తొలగించాలని ఆలోచన మానుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కాగా, ఈనెల26న జరిగే ఐలమ్మ జయంతి ఉత్సవాలకు అన్నివర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. రాష్ట్రగౌరవ అధ్యక్షుడు డాక్టర్ కే.వీ.కృష్ణారావు, గౌరవ సలహాదారుడు డాక్టర్ శీలం పాపారావు, ముస్లిం జేఏసీ నాయకుడు రెహమాన్ మాట్లాడగా వివిధ సంఘాల నాయకులు బీ.వీ.రాఘవులు, పసుమర్తి సతీష్, భద్రునాయక్, వెంకటప్పయ్య, సట్టు సతీష్, రామారావు, కృష్ణవేణి, నర్సింహారావు, రాంబాబు, భాస్కర్, నాగేశ్వరావు, మిర్యాల నాగరాజు, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన అధికారులు



పొలంలో పరిశీలిస్తున్న ఏడీఏ నర్సింహారావు, ఏఓ శ్రీనివాసరావు

సత్తుపల్లి: వరి పంట సగం ఈని, మిగతా సగానికిపైగా పొట్ట దశలో ఉండటం నిజమేనని వ్యవసాయ శాఖ అధికారుల పరిశీలనలో తేలింది. సత్తుపల్లి శివార్లలో పలువురు రైతులు 65 ఎకరాలకు పైగా వరుణ్ సీడ్స్‌కు చెందిన ఎంటీయూ 1061 రకం వరి సాగు చేశారు. అయితే, పంట సగం ఈనగా, మరికొంత పొట్ట దశలోనే ఉండడంతో ఆందోళనకు గురైన రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ఏడీఏ నర్సింహారావు, ఏఓ శ్రీనివాసరావుతో పాటు వరుణ్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు వేర్వేరుగా పంట పొలాలను పరిశీలించారు. కాగా, రైతులకు ఎంత మేరకు నష్టం వాటిల్లుతుందో ఇప్పుడే చెప్పలేమని, శాస్త్రవేత్తలు పరిశీలిస్తేనే ఒక అంచనా వస్తుందని ఏడీఏ నర్సింహారావు తెలిపారు. అలాగే, వరుణ్ కంపెనీ ప్రతినిధి మహేందర్ ఈ విషయమై కంపెనీకి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అయితే, కారణాలు ఏమైనా దిగుబడి తగ్గే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శాస్త్రవేత్తలు కూడా పరిశీలించాక నివేదిక ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు గొర్లమారి సుధాకర్‌రెడ్డి, మందపాటి సోమిరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి తదితరులు కోరారు.

బాలికపై అత్యాచారం కేసులో ఐదుగురికి జైలుశిక్ష

20ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా

ఖమ్మం లీగల్/కారేపల్లి: బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు ఆయనకు సహకరించిన నలుగురికి ఇరవై ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. కారేపల్లి మండలం భల్లునగర్‌తండాకు చెందిన బానోత్ లక్ష్మణ్.. పదిహేనేళ్ల బాలికను 2021 జనవరి 31వ తేదీ రాత్రి కిడ్నాప్ చేశాడు. ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదుతో అప్పటి సీఐ బి.శ్రీనివాసులు, ఎస్‌ఐ పి.సురేష్‌కుమార్ విచారణ చేపట్టారు. బాలికను కిడ్నాప్ చేసిన లక్ష్మణ్ అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. అలాగే, ఆయనకు తల్లిదండ్రులు బానోత్ శ్రీను, సరోజ, బంధువులైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన తేజావత్ దేవి, ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలీకి చెందిన అజ్మీరా లక్ష్మి సహకరించినట్లు విచారణలో గుర్తించారు. వీరిపై పోక్సోతో పాటు ఇతర సెక్షన్లపై కేసు నమోదు చేసి చార్జీషీట్ దాఖలు చేయగా, ఐదుగురికి ఇరవై ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కొత్త వెంకటేశ్వరరావు వాదించగా ఎస్‌ఐ వి.భద్రునాయక్‌తో పాటు సిబ్బంది కె.మోహన్, టి.వెంకటేశ్వరరావు, ఎం.ఉమారాణి, యాకూబ్ సహకరించారని కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు.

రైలులో 40 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో ఎక్సైజ్, ఆర్‌పీఎఫ్ ఉద్యోగులు

మధిర: కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న 40కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రైలులో మధిర నుంచి ఖమ్మం వరకు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా రూ.6 లక్షల విలువైన గంజాయి లభించింది. తనిఖీల్లో ఏఈఎస్ తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్, ప్రసాద్, ఎస్సైలు చంద్రశేఖర్, అచ్చారావు, రైల్వేఅధికారులు ప్రసన్నకుమార్, సిబ్బంది వలరాజు, సుధీర్, హరీష్, హనుమంతురావు, వెంకటేష్, రియాజ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తీసుకెళ్తున్న వ్యక్తి అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ వద్ద మంగళవారం చేపట్టిన తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద రెండు కేజీల గంజాయి లభించింది. ఖమ్మం అర్బన్ ఎస్‌ఐ పి.వెంకన్న ఆధ్వర్యాన సిబ్బంది మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రఘునాథపాలెం మండలం మంచుకొండకు చెందిన కృష్ణార్జున్ పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆయనను అదుపులోకి తనిఖీ చేయగా రెండు కేజీల గంజాయి లభించింది. గంజాయి అలవాటు ఉన్న కృష్ణార్జున్ ఒడిశా నుంచి తీసుకొచ్చి తన అవసరాలకు వాడడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

బాకీ అడిగినందుకు రోకలిబండతో దాడి

నేలకొండపల్లి: బాకీ ఉన్న రూ.100 ఇవ్వాలని అడిగినందుకు రోకలిబండతో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. మండలంలోని చెరువుమాధారానికి చెందిన పి.సైదులు అదే గ్రామానికి చెందిన షేక్ వీసా రూ.100 బాకీ ఉన్నాడు. ఈ డబ్బులు ఇవ్వాలని మంగళవారం సైదులు అడుగుతున్న క్రమంలో వివాదం చోటు చేసుకుంది. దీంతో సైదులు తొలుత రోకలిబండను వీసా వైపు విసరగా, ఆయన అదే రోకలిబండతో సైదులును బలంగా కొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన సైదులును ఖమ్మం తరలించగా, పోలీసులు వీసాను అదుపులోకి తీసుకున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

కల్లూరు: మండలంలోని చెన్నూరులో ఓ మైనర్ బాలికను వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన యువకుడిపై కల్లూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఎస్.కే.రహీమ్ కొన్ని రోజులుగా బాలికలను వేధిస్తుండడంతో ఆమె కుటుంబీకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తిపై..

కారేపల్లి: పిల్లల తగాదా విషయాన్ని తల్లిదండ్రులకు వివరిస్తున్న ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం విద్యార్థుల మధ్య తగాదా జరిగింది. ఈ విషయమై గురుకుల వైస్ ప్రిన్సిపల్ చింతా రాఘునాథం మంగళవారం తల్లిదండ్రులను పిలిచి మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో ఖమ్మం వైఎస్సార్ కాలనీకి చెందిన పొట్టపెంజర ఉదయ్‌కుమార్ ఒక్కసారిగా వైస్ ప్రిన్సిపాల్‌పై దాడి ,చేశాడు. దీంతో ఆయన ఫిరఆయదు మేరకు ఉదయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

వృద్ధురాలిని నమ్మించి ఆభరణాలు దోపిడీ

తిరుమలాయపాలెం: అరవై ఏళ్ల వృద్ధురాలిని నమ్మించి మోటార్‌సైకిల్‌పై తీసుకొచ్చి ఆభరణాల దోపిడీ చేసిన ఘటనపై తిరుమలాయపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన బానోతు సరోజనను అదేగ్రామానికి చెందిన బర్మావత్ రవి ఈనెల 10న సాయంత్రం నమ్మించి మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని తిరుమలయపాలెం మండలం సుబ్లేడు క్రాస్ వద్ద ఉన్న గుట్టల ప్రాంతానికి తీసుకొచ్చాడు. అక్కడ ఆమెపై దాడి చేసి మెడలోని సుమారు రూ.1.20లక్షల విలువైన బంగారు గొలుసు, ఉంగరం ఎత్తుకెళ్లాడు. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయగా మంగళవారం ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి నిందితుడు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

బోనకల్: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అన్ని ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపిస్తుందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని రాపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన 35 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని తెలిపారు. మధిర మార్కెట్ చైర్మన్ బందం శ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున్‌తో పాటు వేమూరి ప్రసాద్, కరివేద సుధాకర్, గద్దల వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యావిధానం కావాలి..

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: దేశానికి కావాల్సింది సనాతన ధర్మం కాదని.. శాస్త్రీయ విద్యా విధానం కావాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మంలోని పీజీ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ 30వ జాతీయ మహాసభల పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మహాసభలు బీహార్ రాష్ట్రంలోని బెగుసరాయ్‌లో ఈనెల 28 నుండి అక్టోబర్ 1వరకు జరుగుతాయని తెలిపారు. కేంద్రప్రభుత్వం విద్యావిధానంలో మార్పులు చేస్తూ కాషాయీకరణ వైపు మళ్లిస్తోందని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో విద్యార్థుల మెదడులో మత విద్వేషాలను నింపుతున్నారని ఆరోపించారు. దేశ ప్రతిష్టను పెంచే ఇస్రో లాంటి సంస్థలకు శాస్త్రవేత్తలను అందించే విద్యావిధానాన్ని ఈ దేశం కోరుకుంటోందని తెలిపారు. కాగా, బీహార్‌లో జరగనున్న మహాసభల్లో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సుదీర్ఘంగా చర్చిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు యువరాజ్, శివనాయక్, చందులాల్, ఆకాష్, సంతోష్, నవ్య శ్రీ, సతీష్, నరేష్, గోపి, ఉమ, శైలజ, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల మూసివేత యోచనలో ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ హాస్టళ్లను మూసివేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆరోపించారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా మెస్ చార్జీలు చెల్లించకపోవటంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలను వ్యాపారులు సరఫరా చేయడంలేదని తెలిపారు. తద్వారా హాస్టళ్ల మూసివేయాలని ప్రభుత్వం కుట్ర పన్నినట్లుగా అర్థమవుతోందని చెప్పారు. ఇకనైనా మెస్ చార్జీలు చెల్లించడంతో పాటు బీసీ విద్యార్థులు, హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారితోపాటు లింగబోయిన పుల్లారావు, హరికిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్'



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: దళితులను అన్నిరకాలుగా సీఎం కేసీఆర్ మోసం చేశాడని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ నంబూరి రామలింగేశ్వరరావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని మంగళవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యాన దళితులకు అనేక అవకాశాలు దక్కగా కేసీఆర్ మాత్రం అడుగడుగునా మోసం చేశారన్నారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా నుంచి ఎస్సీ మోర్చా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.